

బేబీ సారా, వెంకటేష్

## మనసుల్ని కట్టిపడేసే 'సైంధవ్'

వెంకటేశ్‌కి బాగా కలిసొచ్చిన సీజన్ సంక్రాంతి. ప్రేమ, చంటి, ధర్మచక్రం, కలిసుందాం‌రా.. ఇవన్నీ సంక్రాంతి రిలీజ్‌లే. ఈ లిస్ట్‌లో 'సైంధవ్' కూడా చేరనున్నది. జనవరి 13న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్టు మేకర్స్ అధికారికంగా తెలియజేశారు. చాలాకాలం తర్వాత ఉద్వేగపూరితమైన పాత్రలో వెంకటేశ్ కనిపించనున్నారని తెలిసింది. నవాజుద్దీన్ సిద్ధిఖీ కీలక పాత్ర పోషిస్తుండటం, 'హిట్ సిరీస్' ఫేం శైలేష్ కొలను దర్శకుడు కావడంతో ప్రేక్షకుల్లో సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. 'సైంధవ్' హీరోగా వెంకటేశ్‌కి 75వ సినిమా కావడం మరో విశేషం. ఈ సినిమా వైవిధ్యమైన కథ, కథనాలతో సాగుతుందని, ప్రత్యేకతల సమాహారంగా ఉంటుందని, బేబీ సారా, వెంకటేశ్ మధ్య సాగే సన్నివేశాలు మనసుల్ని కట్టిపడేస్తాయని మేకర్స్ చెబుతున్నారు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ పాన్ ఇండియా చిత్రం ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుకుంటున్నది. ఆర్య, శ్రద్ధాశ్రీనాథ్, రుహానీ శర్మ, ఆండ్రియా జెరెమియా ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఎస్.మణికందన్, నిర్మాత: వెంకట్ బోయనపల్లి, నిర్మాణం: నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్.


## 'జాతిరత్నాలు'కు తగ్గదు

'ట్రైలర్ చూశాను.. పేరుకు తగ్గట్టే 'మ్యాడ్'గా ఫన్నీగా ఉంది. ఎవరూ కొత్త వాళ్లలా లేరు. అందరూ బాగా చేశారు. ఈ సినిమా విజయం పక్కా.' అని దుల్కర్ సల్మాన్ అన్నారు. సంగీత్‌శోభన్, నార్నే నితిన్, రామ్ నితిన్, శ్రీగౌరీప్రియ, అనంతిక సునీల్‌కుమార్, గోపికా ఉద్యాన్ ప్రధానపాత్రధారులుగా రూపొందిన చిత్రం 'మ్యాడ్'. కల్యాణ్‌శంకర్ దర్శకుడు. హారిక సూర్యదేవర నిర్మాత. ఈ చిత్రం ఈ శుక్రవారం విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. దుల్కర్‌సల్మాన్, సిద్ధు జొన్నలగడ్డ, శ్రీలీల అతిథులుగా హాజరయ్యారు. నవ్వించే విషయంలో 'జాతిరత్నాలు'కు ఈ సినిమా ఏమాత్రం తగ్గదని సిద్ధు జొన్నలగడ్డ నమ్మకంగా చెప్పారు. ఇంకా శ్రీలీల, వెంకీ అట్లూరి, అనుదీప్‌లతో పాటు ప్రధానతారాగణం అంతా మాట్లాడారు.



దుల్కర్ సల్మాన్, కళ్యాణ్ శంకర్, సిద్ధు జొన్నలగడ్డ, అనంతిక, శ్రీలీల

## సత్యానంద్‌ను సత్కరించుకోవడం ఓ భాగ్యం..



సత్యానంద్, చిరంజీవి

అగ్ర నటుడు చిరంజీవి, రచయిత సత్యానంద్‌ల అనుబంధం ఈనాటిది కాదు. చిరంజీవి కెరీర్‌లో అత్యధిక చిత్రాలకు రచన చేసిన క్రెడిట్ సత్యనంద్‌ది. రచయితగా సత్యానంద్ 50ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి, తన అభిమాన రచయితను ఇంటికి పిలిపించుకుని మరీ అభినందించి, సత్కరించారు. ' సినిమాను జీవన విధానంగా మార్చుకున్న నిత్య విద్యార్థి సత్యానంద్, నా ఎన్నో చిత్రాలకు అద్భుతమైన సంభాషణలను అందించారాయన. నాలాగా ఎంతో మంది నటీనటుల అభ్యున్నతికి కారణమయ్యారు. యాభైఏళ్ల రచనాప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న ఈ సరస్వతీపుత్రుడ్ని సత్కరించుకోవడం ఓ భాగ్యం.' అంటూ తన ట్విటర్‌లో కూడా పోస్ట్ చేశారు చిరంజీవి. ఈ సందర్భంగా సత్యానంద్‌ని సత్కరిస్తున్న ఫొటోను కూడా ఆయన షేర్ చేశారు.



రత్నంకృష్ణ

## ఆద్యంతం నవ్వులే

'జాతిరత్నాలు' చూసి నవీన్ పోలిశెట్టి అభిమానిని అయ్యాను. కథ అతనికే చెబుదామనుకున్నాను. కుదర్లేదు. కొందరు మిత్రులు కిరణ్ అబ్బవరం పేరు సూచించారు. కథ నచ్చడంతో కిరణ్ ఓకే చెప్పాడు. రషస్ చూశాక నా అంచనాలకు మించి చేశాడు అనిపించింది.' అని దర్శకుడు రత్నంకృష్ణ అన్నారు. కిరణ్ అబ్బవరం, నేహాశెట్టి జంటగా రత్నంకృష్ణ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'రూల్స్ రంజన్'. మురళీకృష్ణ వేమూరి, దివ్యాంగ్ లవానియా నిర్మాతలు. ఈ శుక్రవారం సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా రత్నంకృష్ణ విలేకరులతో మాట్లాడారు. ' 'ఆక్సిజన్' తర్వాత కామెడీ సినిమా చేయాలని 'రూల్స్‌రంజన్' కథ రెడీ చేసుకున్నాను. ఫస్టాఫ్ యూత్‌ఫుల్‌గా, సెకండాఫ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా సినిమా ఉంటుంది. ఆద్యంతం నవ్వించే సినిమా ఇది' అని రత్నంకృష్ణ చెప్పారు. 'ఇటీవలే అందరం కలిసి సినిమా చూశాం. అందరూ హ్యాపీ. అందరూ మెచ్చే సినిమా అవుతుంది' అని నమ్మకం వ్యక్తం చేశారు రత్నంకృష్ణ.



రామ్‌చరణ్

## అపజయం ఎరుగని దర్శకుడితో..

'ఆర్ఆర్ఆర్'తో రామ్‌చరణ్‌కి బాలీవుడ్‌లోనూ మంచి క్రేజ్ ఏర్పడింది. ప్రస్తుతం బాలీవుడ్ దర్శక, నిర్మాతలు చరణ్ కోసం కథలు తయారుచేసుకునే పనిలోవున్నారు. అందులో కొందరు క్రేజీ దర్శకులు కూడా ఉన్నారు. వారిలో అపయజం ఎరుగని దర్శకుడు రాజ్‌కుమార్ హిరానీ కూడా ఉన్నట్టు తెలుస్తున్నది. ఇటీవలే ముంబయ్‌లో రామ్‌చరణ్‌ని రాజ్‌కుమార్ హిరానీ కలిసినట్టు విశ్వసనీయ సమాచారం. రామ్‌కుమార్ ఓ కథ కూడా చరణ్‌కి వినిపించినట్టు తెలిసింది. అంతటి దర్శకుడు కథ చెబితే ఏ హీరో కాదంటాడు చెప్పండి?. రాజ్‌కుమార్ హిరానీ ప్రస్తుతం షారుఖ్‌ఖాన్‌తో 'డంకీ' సినిమా చేస్తున్నారు. ఆ సినిమా తర్వాత రామ్‌చరణ్ సినిమా ఉంటుందని తెలుస్తున్నది. ఇక రామ్‌చరణ్ శంకర్ 'గేమ్‌ఛేంజర్' తర్వాత బుచ్చిబాబు సన సినిమా చేస్తారు. ఈ రెండు సినిమాల తర్వాత రాజ్‌కుమార్ హిరానీ ప్రాజెక్ట్‌లోకి ఎంటరవుతారని తెలుస్తున్నది. ఇది మెగా అభిమానులకు నిజంగా గుడ్ న్యూసే.



మాళవికా మోహన్



ప్రశాంత్‌నీల్, ఎన్టీఆర్

## ఎదురుచూపులు ఫలించాయి..

'ఆర్ఆర్ఆర్'తో ఎన్టీయార్ క్రేజ్ ప్రపంచవ్యాప్తం అయితే.. 'కేజీఎఫ్'సిరీస్‌తో దర్శకుడిగా ప్రశాంత్‌నీల్ క్రేజ్ పాన్ ఇండియా స్థాయికి చేరింది. వీరిద్దరూ కలిసి ఓ ప్రాజెక్ట్ చేస్తున్నారంటే ఇక ఆ సినిమా అంచనాలు ఏ స్థాయిలో ఉంటాయో ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. వీరి కలయికలో సినిమా అనే వార్త వచ్చినప్పట్నుంచీ ఎప్పుడెప్పుడు సెట్స్‌కి వెళ్తుందా అని అభిమానులు ఆతృతగా ఎదురు చూస్తున్నారు. వారి ఎదురు చూపులు ఎట్టకేలకు ఫలించనున్నాయి. 2024 ఏప్రిల్ నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మొదలుకానున్నట్టు మేకర్స్ అధికారికంగా తెలియజేశారు. ప్రస్తుతం తారక్ 'దేవర' షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. ఈ సినిమా రెండు భాగాలుగా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఇక ప్రశాంత్‌నీల్ 'సలార్'తో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. ఇవి పూర్తయ్యాక, వీరిద్దరి సినిమా పని మొదలవుతుంది. మైత్రీమూవీమేకర్స్, ఎన్టీయార్ ఆర్ట్స్ కలిసి ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు.

## అబద్ధాల్లో బతకలేను..

పేటా, మాస్టర్ సినిమాలతో దక్షిణాదిన గుర్తింపుతెచ్చుకున్న తార మాళవికా మోహన్. ప్రస్తుతం విక్రమ్ హీరోగా పా.రంజిత్ తెరకెక్కిస్తున్న 'తంగలాన్' సినిమాలో నాయికగా నటిస్తున్నది ఈ అందాలభామ. ఇటీవల మాళవిక సరదాగా తన ఫ్యాన్స్‌తో ఇంటరాక్ట్ అయ్యారు. 'తంగలాన్' ఆలస్యం గురించి అభిమానులు అడగ్గా ' ఈ విషయం పా రంజిత్‌ని అడగాలి. నా వరకూ 'తంగలాన్' ప్రత్యేకమైన సినిమా. నటిగా అందులోని పాత్ర నాకో సవాల్. పనిచేసిన అందరికీ మంచి పేరు తెచ్చే సినిమా అది' అని చెప్పారు మాళవికా. మీ ఇష్టమైన హీరో ఎవరు? అనడిగితే తడుముకోకుండా 'ఫహాద్ ఫాజిల్' అని చెప్పేసింది మాళవిక. మిగతా హీరోలకు కోపం వస్తే?.. అనంటే, 'రానివ్వండి అబద్ధాల్లో బతకలేను. నా అభిప్రాయం చెప్పా' అనేసింది ధైర్యంగా. డ్రీమ్‌రోల్ ఏమైనా ఉందా? అనడిగితే.. 'రాజకుమారిగా పీరియాడికల్ సినిమాలో చేయాలనుకుంది' అంటూ మనసులోని కోరిక బయటపెట్టింది మాళవిక.







